క్లుప్తంగా

టీబీ నివారణపై అవగాహన



పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి, రేమద్దుల, తెల్లరాళ్లపల్లి పరిధిలో టీబీ నివారణపై శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన నిర్వహించారు. వ్యాధి అనుమానితుల నుంచి తెమడ సేకరించారు. తీవ్రమైన దగ్గు, జ్వరం, ఛాతిలో నొప్పి, తలనొప్పి, నీరసం, అలసట, ఆకలి, బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, రాంచందర్, సతీష్, మదన్‌గోపాల్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీసీ, మైనార్టీబంధు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహిస్తుండడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని విషయాన్ని సభ్యులు, అధికారులు గమనించాలని ఆయన కోరారు.

వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో వైద్య సిబ్బంది శుక్రవారం కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై ఇంటింటి సర్వే నిర్వహించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు క్రమంతప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. కార్యక్రమంలో రాంచందర్, ఆశాకార్యకర్త పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



పెబ్బేరు రూరల్: నీట్‌లో ర్యాంక్ సాధించి వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందిన శ్రీరంగాపురం మండల కేంద్రం అంబేడ్కర్ కాలనీకి చెందిన నర్మదను శుక్రవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, చెన్నరాములు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎల్లస్వామి, రమేష్, ధర్మ, సుమన్‌యాదవ్, రాజు, నాగరాల దయాకర్, బీసన్న పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెబుతాం

పెబ్బేరు రూరల్: ముదిరాజులకు బీఆర్‌ఎస్ నుంచి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కేటాయించకుండా మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల కార్యదర్శి సహదేవుడు శుక్రవారం ప్రకటనలో మండిపడ్డారు. 115 మంది అభ్యర్థులను ప్రకటించగా, 20 శాతం ఉన్న ముదిరాజులను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముదిరాజుల ఓటు బీఆర్‌ఎస్‌కు పడకుండా గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

ఆశా కార్యకర్త మృతి



జయమ్మ (ఫైల్)

పాన్‌గల్: మండలంలోని కదిరెపాడుకు చెందిన ఆశా కార్యకర్త జయమ్మ (53) శుక్రవారం కుష్ఠు వ్యాధి గుర్తింపు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ గుండెపోటుకు గురై మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని సర్పంచ్ లక్ష్మయ్య, ఎంపీటీసీ నాగమ్మ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పరామర్శించారు.
కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎం సుమిత్ర పరామర్శించి రూ.5వేలు అందజేశారు.

త్వరలో కాంగ్రెస్‌లో చేరికలు

చిన్నంబావి: కొల్లాపూర్ నియోజవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి భారీ చేరికలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఖాదర్‌యాదవ్, నరేందర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ రోజురోజుకు బలపడుతుందని, అధికార పార్టీకి చెందిన సుధారాణి కాంగ్రెస్‌లోకి రావడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో విష్ణు, శ్యాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేతేపల్లి వాసి ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్ శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేసినట్లు పేర్కొన్నారు. ఓయూ విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ ఉద్యమంలో పనిచేశానని, నియోజకవర్గంలో బీసీ అభ్యర్థిగా అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపాలిటీల్లోకి వీఆర్‌ఏలు

- వార్డు స్థాయి అధికారులు, జూనియర్ అసిస్టెంట్‌లు
- జిల్లాలో 31 మందికి కేటాయింపు
- పట్టణంలోని వార్డుల సమస్యలకు పరిష్కారం



పెబ్బేరులోని వార్డు పర్యవేక్షణలో అధికారులు

పెబ్బేరు రూరల్: వీఆర్‌ఏల సర్దుబాటుతో మున్సిపాలిటీల్లో వార్డు అధికారుల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టణ ప్రజల సౌలభ్యం కోసం వార్డు స్థాయిలోనే అన్ని సేవలు అందించాలంటే వార్డుకు ఒక అధికారి ఉండాలని భావించి ఆయా మున్సిపాలిటీలకు వీరిని కేటాయించింది. ఇటీవల వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ప్రభుత్వం వారిని వివిధ శాఖల్లోకి సర్దుబాటు చేస్తుంది. ఈ క్రమంలో జిల్లాలోని మున్సిపాలిటీలకు వార్డు స్థాయి అధికారులు, జూనియర్ అసిస్టెంట్‌లుగా పేర్కొంటూ ఉద్యోగుల్ని కేటాయించగా వారు ఇక్కడకు చేరకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో ఇప్పటికే వార్డు అధికారులను నియమించి వారిని అక్కడే ఉండేలా ఏర్పాటు చేసి మంచి ఫలితాలు రాబట్టారు. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన వార్డు సిబ్బందితో పట్టణాల్లో సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని ఆశిస్తున్నారు.

31 మంది కేటాయింపు..

మున్సిపాలిటీ అంటేనే విస్తరిస్తున్న పట్టణాలు.. వీటిలో సమస్యల పరిష్కారం కత్తిమీద సాములాంటిదే. మంచినీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, పందులు, వీధికుక్కలు తదితర సమస్యలపై స్థానికులు మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వచ్చేది. చాలా సందర్భాల్లో ఫిర్యాదు చేసినా ఫలితం ఉండేది కాదు. ఇబ్బందుల పరిష్కారానికి సమయం పట్టేది. పురపాలికలకు అనుబంధ గ్రామాలు ఉంటే అక్కడి పరిస్థితి అంతే. ఈ క్రమంలో వార్డుల్ని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను నియమించాలని నిర్ణయించి జిల్లాలకు బదిలీ చేయగా వనపర్తి జిల్లాకు మొత్తం 31 మంది సిబ్బంది అందుబాటులోకి వచ్చారు.

వార్డు పరిధిలో కార్యాలయం..

ప్రతి వార్డుకి అధికారులను నియమించడంతో సమస్యలు నేరుగా గుర్తించే వీలుంటుంది. పేరుకుపోయిన చెత్త, జంతువుల కళేబరాలు, వెలగని బల్బులు వంటివాటిపై తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది. అక్రమ కట్టడాలపై పర్యవేక్షణ, రోడ్లపై గుంతలు పూడ్చివేత వంటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. ఈ నేపథ్యంలో వార్డుల్లో నియమించే అధికారికి వార్డు కార్యాలయాల్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అందులోనే కౌన్సిలర్‌కు ప్రత్యేక గది ఏర్పాటు చేస్తే ప్రజలకు అందుబాటులో ఉండటానికి ఆస్కారం ఉంటుంది.

జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు..

మున్సిపాలిటీ	వార్డులు	నియమితులైన సిబ్బంది
వనపర్తి	32	5
కొత్తకోట	15	8
పెబ్బేరు	12	7
ఆత్మకూర్	10	6
అమరచింత	10	5

త్వరలోనే బాధ్యతలు అప్పగిస్తాం



వార్డు అధికారుల నియామకం వల్ల పనిలో వేగం పెరుగుతుంది. సమస్యల పరిష్కారానికి అవకాశం దక్కుతుంది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సిబ్బందిని కార్యాలయంలో ఇతర పర్యవేక్షణ పనులకు వినియోగిస్తున్నాం. వార్డుల వారీగా త్వరలోనే బాధ్యతలు అప్పగిస్తాం.

– ఆదిశేషు, మున్సిపల్ కమిషనర్, పెబ్బేరు

వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..



వీపనగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ టికెట్ ప్రకటించిన తర్వాత నియోజకవర్గానికి భారీ ర్యాలీతో వనపర్తి నుంచి మండల కేంద్రం మీదుగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వెళ్తున్న సందర్భంగా శుక్రవారం పలు స్టేజీల వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. దావాజిపల్లి, అన్నారం, గోప్లాపూర్, పాన్‌గల్, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా వద్ద నాయకులు పూలమాలలు వేశారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేశారు.

వీపనగండ్ల: మండల కేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు.వందలాది వాహనాలతో పార్టీ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో..

చిన్నంబావి: ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల నాయకులు భారీ కార్ల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మండల కేంద్రంలోని వాల్మీకి, అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి డిపాజిట్లు గల్లంతవుతాయన్నారు. కొందరు సోషల్ మీడియా ద్వారా తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వాటన్నిటికి ఎన్నికలే తగిన బుద్ధి చెప్తాయన్నారు.

ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు



మదనాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పారుతున్న నీరు

మదనాపురం: మండల సమీపంలోని ఊకచెట్టువాగులో ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆత్మకూర్, వనపర్తి ప్రధాన రోడ్డుపై పొలాల నుంచి వచ్చే నీరు వృథాగా పారుతుడంతో రోడ్డు గుంతలమయమయ్యాయి. రైతులు వరి పంట నుంచి ఎక్కువైన నీటిని రోడ్డుపైకి వదులుతున్నారు. దీంతో రోడ్డుకు నాచు పట్టి ద్విచక్ర వాహనాలు జారి గుంతల్లో కిందపడుతున్నారు. రాత్రివేళల్లో ఈ రహదారి పై అవగాహన లేని వ్యక్తులే ఎక్కువ ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో ఆత్మకూర్, కొత్తకోట, వనపర్తి ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు తిరుగుతుంటాయి. రోడ్డు గుంతలు ఏర్పడిన నీళ్ల పారుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్డు పక్కన కాల్వ పెట్టి పొలాల నుంచి వచ్చే నీటిని వాగులోకి నేరుగా పంపించే వెసులుబాటు ఉన్న అధికారులు పట్టించుకోకపోవడమే ప్రమాదాలకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ప్రమాదాలు కాకుండా గుంతలను పూడ్చివేసి, వచ్చే నీటిని రోడ్డు పక్క నుంచి వాగులోకి పంపించాలని కోరుతున్నారు.

అవినీతిపరులకు ఓటుతో బుద్ధి చెప్పండి



తూడుకుర్తిలో ధర్నా చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న మేఘారెడ్డి

గోపాలపేట: అక్రమంగా ఆస్తులు సంపాదించిన నాయకులను ప్రజలు ఓటుతో బుద్ధి చెపాల్సని మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఉమ్మడి మండలంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మండల కేంద్రంలో అనారోగ్యానికి గురైన రామకృష్ణకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం ఏదుట్లలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం రేవల్లి మండలంలోని తల్పునూరు గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలపాలని దీక్ష చేస్తున్న గ్రామస్తుల దగ్గరికి వెళ్లి వారికి మద్దతు తెలిపారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ నుంచి తనను గెలిపించాలని, అనంతరం మొదటి పని తల్పునూరును నాగర్‌కర్నూల్ జిల్లాలో కలిపి గ్రామస్తులకు కానుక ఇస్తానని చెప్పారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి ఇబ్బందులు లేవని ఎవరికి టికెట్ ఇచ్చినా తప్పకుండా పనిచేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో నిరంకుశపాలన కొనసాగుతోందని తొందరలోనే వారిని ఇంటికి పంపిస్తామని అన్నారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని చెప్పారు. ప్రజలు ఓటును వినియోగించుకుని బూటకపు మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాలికెపాడు ప్రజలతో మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని, బీసీబంధు అని మభ్యపెట్టి బీసీలకు అసెంబ్లీ సీట్లు తక్కువ కేటాయించారని విమర్శించారు. ఆయన వెంట సత్యశీలారెడ్డి, వెంకటేష్, వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, యాదయ్య, కేశవులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని తిరుమలకాలనీకి చెందిన యువతి అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తిరుమల కాలనీలో వెంకటేశ్వర్‌రెడ్డి, పద్మమ్మ దంపతుల కుమార్తె వేదవతి నివసిస్తున్నారు. తండ్రి మేస్త్రి పని కోసం హైదరాబాద్ వెళ్లాడు. రోజులాగే ఉదయం తల్లి కూలీకి వెళ్లింది. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చేసరికి కూతురు వేదవతి కనిపించలేదు. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో అదేకాలనీకి చెందిన యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంత్రాలయానికి ప్రత్యేక రైలు

గద్వాల రూరల్: గద్వాల నుంచి మంత్రాలయానికి ప్రత్యేక రైలు సౌకర్యాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కల్పించారు. ఈమేరకు తాజాగా వారు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈవిషయం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. మచిలీపట్నం–కర్నూల్ నగరాల మధ్య నడుస్తున్న ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును గద్వాల జంక్షన్ మీదుగా మంత్రాలయం రోడ్డుస్టేషన్ వరకు పొడగించారు. ప్రయోగాత్మకంగా ఈ రైలును ఈనెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు నడపనున్నారు. ఈ రైలు పొడిగింపుపై ప్రయాణికుల రద్దీని బట్టీ ఆధారపడి ఉంటున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



పట్టణంలో వివిధ కాలనీల నుంచి బోనాల ఊరేగింపు

వనపర్తిటౌన్: పట్టణంలోని గాంధీనగర్, దళితవాడ, ప్యాటగడ్డ, ఇందిరాకాలనీ, మారెమ్మకుంట వీధి, జమ్మిచెట్టు కాలనీలో, టౌన్ చర్చి వీధిల నుంచి శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున డప్పువాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా బోనాలతో ఊరేగింపు చేపట్టారు. పసుపు, కుంకుమ, వేపకు, సున్నంతో ఆచారం ప్రకారం కుండకు పోశమ్మ, కర్రెమ్మ ప్రతిమను తయారు చేసి, ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్య మొక్కులను సమర్పించుకున్నారు. బోనాల ప్రతిమలను ఊరేగించే మహిళలకు ఆయా కాలనీల కుటుంబసభ్యులు శుద్ధినీటితో స్వాగతం పలికారు. కొందరు చిన్నపిల్లలను ముస్తాబు చేసి బోనాలను అమ్మవారికి సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

రాష్ట్రాన్ని సల్లంగా చూడు తల్లి

రాష్ట్ర, జిల్లా ప్రజలను సల్లంగా చూడు తల్లి అని జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో ఉన్న కర్రెమ్మ, పోశమ్మలకు మాజీ మంత్రి చిన్నారెడ్డి పూజలు చేశారు. బోనాల సందర్భంగా కర్రెమ్మ, పోశమ్మలకు టెంకాయలు కొట్టి దీవెనలు తీసుకున్నారు. అన్ని పండుగలకన్నారాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ ప్రత్యేకమని చెప్పారు. ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండేలా దీవించుతల్లి అని మొక్కి, ఆలయ కమిటీ సభ్యులకు, ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



బోనాలకు స్వాగతం పలుకుతున్న మహిళలు

మహనీయులకు ఘన నివాళి



చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: యువత మహనీయుల ఆదర్శంతో జీవితంలో ఎదగాలని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతిని, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు మహనీయుల చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన కవితలతో ప్రజల్లో చైతన్యం నింపిన సురవరం ప్రతాపరెడ్డి, బీసీ వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన బీపీ మండల్ యాదవ్ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నరసింహశర్మ, నాగన్నయాదవ్, బండలయ్య, దేవన్న నాయుడు, విష్ణు నాయుడు, నాగరాజు, రాములు యాదవ్ పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగ.. గ్రామస్తుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన తాడిపర్తి గ్రామస్తులు

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తిలో శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా 33 కేవీ విద్యుత్‌లైన్ ఓవర్‌లోడ్‌తో తెగి ఇళ్లపై పడిపోయింది. దీంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ వైర్ ఇళ్ల మీద ఉండటంతో పాటు 11 కేవీ, ఎల్‌టీ లైన్‌పైన పడటంతో టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయని తాడిపర్తి గ్రామంలోని చింతలబస్తివాసులు తెలిపారు. కొన్ని సెకండ్లలోనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇళ్లపై నుంచి లైన్ ఉండటంతోనే ఇలా జరిగిందని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోయారు. వెంటనే 33 కేవీ లైన్‌ను ఊరి బయటి నుంచి కొత్తగా తీయాలని డిమాండ్ చేస్తూ మెయిన్‌రోడ్డుపై బైఠాయించారు. వెంటనే అక్కడకు చేరుకున్న డీఈ ఆదయ్యగౌడ్, ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కొన్ని రోజుల్లోనే విద్యుత్‌లైన్ మార్చుతామని చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



అమరచింత పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

అమరచింత: బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతుందని వీటిని ప్రశ్నించే గొంతుకలను అరెస్టులు చేస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రాలలో చేపట్టిన ధర్నాకు వెళ్తున్న బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. డబుల్ బెడ్రూంల పేరిట అవినీతి పెరిగిందని నాయకులు ఆరోపించారు. దళితబంధు, గృహలక్ష్మి లబ్ధిదారుల అవకతవకలపై చలో కలెక్టరేట్‌కు వెళ్తున్న నాయకులను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. భాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, విష్ణు పలువురు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



పెబ్బేరులో వత్రం చేస్తున్న భక్తులు

అమరచింత: శ్రావణ శుక్రవారం పురస్కరంచుకుని మండలంలోని ప్రధాన ఆలయాలతో పాటు ఇళ్లలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వరకాలనీతో పాటు శివచౌడేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రత పూజల్లో పాల్గొన్నారు. తమ కుటుంబాలు కలకాలం సంతోషంగా ఉండాలని వేడుకున్నారు.

పెబ్బేరురూరల్: పట్టణ కేంద్రంలోని ధర్మశాస్త అయ్యప్పస్వామి, షిరిడీ సాయిబాబా ఆలయాల్లో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వత్రం నిర్వహించారు. గణపతి పూజ, వరలక్ష్మి అమ్మవారికి అభిషకం, మహిళలు సామూహికంగా వత్రం, అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.



అమరచింతలో పూజలు చేస్తున్న మహిళలు

ఖోఖోలో క్రీడాకారులు సత్తాచాటాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: ఖోఖోలో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సూర్యప్రకాశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం బాల, బాలికల జట్లకు ఖోఖో ఫ్రెండ్లీమ్యాచ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. ఖోఖోలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. ఓడినవారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. కర్వెన, రాచాల, రాజాపూర్ జట్లు మ్యాచుల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వడన్న, రాజవర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, మొగులాల్, వినోద్‌కుమార్, రాజశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదు

భూత్పూర్: తాటిపర్తి చెరువులను, కుంటలను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం తహసీల్దార్ భాను కిరణ్‌కు గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కొంత కుంట, గొల్లవాని కుంట, ఊరకుంట, కుమ్మరివాని కుంట, మొగుళ్ల కుంట, వడ్లవాని కుంటలను కొందరు వ్యక్తులు ఆక్రమించి చదును చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు.